క్లుప్తంగా

పెద్దిరెడ్డి కుటుంబం గెలవాలని టెంకాయలు కొట్టారు


టెంకాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: సాధారణ ఎన్నికలలో పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, తంబళ్లపల్లెలో ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గెలుపొందాలని రొంపిచెర్లకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సిరివేలు బాల సుబ్రమణ్యం ముత్యాలమ్మకు శుక్రవారం 101 టెంకాయలు కొట్టి మొక్కారు. పెద్దిరెడ్డి కుటుంబం అత్యధిక మెజార్టీతో గెలిచి రికార్డు సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, నాగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నివాళి


తిమ్మక్క మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న పద్మమ్మ

కుప్పం రూరల్: అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ మద్దతుదారు తిమ్మక్క (64)కు శుక్రవారం మృతి చెందింది. ఇది తెలుసుకున్న కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తల్లి పద్మమ్మ గుడ్లనాయనపల్లెకు వెళ్లి తిమ్మక్క మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గిరిప్రసాద్, కదిరివేలు, గణపతి, నరసింహులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం


విద్యుత్ స్తంభాలు తరలిస్తున్న దృశ్యం

కుప్పం రూరల్: మండలంలోని కూర్మానుపల్లెలో లో ఓల్టేజీ సమస్యను అధికారులు పరిష్కరించారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో దీనిని రెస్కో చైర్మన్, అధికారుల దృష్టికి సర్పంచ్ అబ్బు తీసుకెళ్లారు. అధికారులు శుక్రవారం మూడు స్తంభాలు నాటి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్తార్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దపంజాణి: మండలంలోని తులసమ్మగుడి ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం హరిప్రసాద్ మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఎదగడానికి నైతిక విలువలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా విద్యాబోధన చేయడంతోపాటు నైతిక విలువల ఉద్దీపనకు మోటివేషన్ క్లాస్లు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాస్కర్, ఆజాద్, దాస్, దేవప్రకాష్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు ఉద్యోగ విరమణ సన్మానం


ఎంఈఓ సాయిలీల దంపతులను సత్కరిస్తున్న డీఈఓ దేవరాజు, ఉపాధ్యాయ బృందం

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ఎంఈఓ సాయిలీల ఉద్యోగ విరమణ పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ దంపతులను ఘనంగా సత్కరించారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంఈఓ సాయిలీల ఎంతో కృషి చేసిందని ఆమె సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రమణ, ఎంఈఓలు కన్నయ్య, చంద్రశేఖర్, బైరెడ్డిపల్లె, వీ.కోట, గంగవరం ఉన్నత పాఠశాలల హెచ్ ఎంలు, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29 వరకు ఆంక్షలు: ఆర్డీఓ

పలమనేరు: ఎన్నికల కారణంగా పట్టణ సమీపంలోని తమ కార్యాలయం వద్ద మెయిన్‌రోడ్డుపై ఈనెల 29వ తేదీ వరకు ఆంక్షలు విధించామని, వాహనాల రాకపోకలను రద్దు చేశామని, పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మార్గంలో నామినేషన్ కేంద్రానికి వందమీటర్ల వరకూ బ్యారికేడ్లు ఏర్పాటు చేశామని, ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లేలా పోలీసులు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

అట్టహాసంగా పెద్దాయన నామినేషన్

- వేలాది మందితో భారీ ర్యాలీ
- కుటుంబ సమేతంగా ఆంజనేయస్వామికి మంత్రి పెద్దిరెడ్డి పూజలు
- పట్టణంలో కోలాహలంగా సాగిన ర్యాలీ



పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన భార్య స్వర్ణమ్మ , కుమార్తె శ్రీశక్తితో కలసి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. తొలుత మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం స్థానిక ఎన్ఎస్.పేటలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ఆశీస్సులు పొందింది. అక్కడి నుంచి ఆర్వో కేంద్రం వరకు వేలాది మంది అభిమానులతో మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి , ఎమ్మెల్సీ భరత్‌తో కలసి ర్యాలీ, గోకుల్ సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ర్యాలీలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప, విరూపాక్షి జయచంద్రారెడ్డి, పృథ్వీరెడ్డి, సుబ్రమణ్య యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ అధ్యక్షులు జయరాం, కొత్తపల్లె చెంగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శులు దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రేన్లతో గజమాలలు

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డిలను అభిమానులు రెండు క్రేన్ల సాయంతో గజమాలలు వేసి సన్మానించారు. ఒక క్రేన్‌లో తులసి గజమాల, మరో దానిలో పండ్లు, పూలు, గజమాలతో వారిని సన్మానించారు.

108, ఫైర్ ఇంజిన్‌కు దారి

ర్యాలీగా వెళ్తున్న సమయంలో ఎన్ఎస్.పేట వద్ద 108 వాహనం వచ్చింది. వెంటనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మైకులో అందరినీ హెచ్చరించి, ర్యాలీని ఆపి, వాహనానికి దారి ఇచ్చారు. అలాగే అగ్నిమాపక యంత్రం రావడంతో దానికి కూడా క్లియరెన్స్ ఇచ్చి ర్యాలీని కొనసాగించారు.

దీవెన | ప్రార్థన


పుంగనూరు ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, శ్రీ శక్తి


పుంగనూరులో దర్గాలో ప్రార్థనలు చేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ర్యాలీ అదుర్స్


ర్యాలీలో నృత్యం చేస్తున్న మహిళలు

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఐచర్ లారీలో హనుమంతరాయునిదిన్నె నుంచి ర్యాలీ ప్రారంభించారు. చెరువు కట్టపై ఉన్న దర్గాలో చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జెండాలు, డీజే పాటల హోరు, షికారీలు, లంబాడీల నృత్యాలతో ర్యాలీ ఉత్సాహంగా ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. రామసముద్రం రోడ్డు, ఎన్ఎస్.పేట, పుంగమ్మ చెరువు కట్టమీదుగా బ్రాహ్మణవీధి, నాగపాళ్యం, ఇందిరాసర్కిల్, ఎంబిటి రోడ్డు, గోకుల్ సర్కిల్ వరకు ఇది కొనసాగింది. ర్యాలీలో మంత్రి పెద్దిరెడ్డి వేలాది మందికి అభివాదం చేస్తూ పలకరిస్తూ ముందుకు సాగారు.

'మన పలమనేరు' యాప్ ఆవిష్కరణ


మనపలమనేరు యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధి గురించి 'మన పలమనేరు' పేరిట రూపొందించిన యాప్‌ను స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పంచాయతీల వారీగా అభివృద్ధి గురించి ప్రజలు తెలుసుకునే ఉద్దేశ్యంతో దీనిని రూపొందించామని, స్మార్ట్ ఫోన్ ఉన్న వారు దీనిని ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకుని చూడాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జాఫర్, వీ.కోట ఎంపీపీ యువరాజ్, డాక్టర్ తమీం, నరేష్, అనిల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధిమాంద్యం పిల్లలకు ఉచిత ఆయుర్వేద శిబిరం

పలమనేరు: పట్టణ సమీపంలోని కిండర్ కేర్ స్పెషల్ స్కూల్‌లో శని, ఆదివారాల్లో బుద్ధిమాంద్యం, మానసిక లోపాలు, అంగవైకల్యం ఉన్న పదేళ్లలోపు పిల్లలకు మదర్‌కేర్ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యులతో ఉచిత ఆయుర్వేద చికిత్సా శిబిరం సీఎస్‌ఏ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాల కోసం 8897506631 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వివక్ష చూపక కుప్పం అభివృద్ధి


ఎన్నికల ప్రచారం చేస్తున్న భరత్ దంపతులు, పార్టీ నాయకులు

- మేలు చేసిన వారిని దీవించండి
- వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి
- ఎమ్మెల్యేగా గెలిపిస్తే కుప్పం మరింత ప్రగతి
- ఎన్నికల ప్రచారంలో భరత్ దంపతుల అభ్యర్థన

కుప్పం: ''మేలు చేసిన వారిని నిండు మనస్సుతో దీవించండి..ప్రతిపక్ష నేత ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివక్ష చూపకుండా కుప్పం నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు..ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో మమేకమయ్యాం...గత ప్రభుత్వ పాలన, జగనన్న పాలనకు ఉన్న తేడా ఏమిటో బేరీజు వేసుకుని వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి'' అని ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తన సతీమణి దుర్గతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం పట్టణంలోని 10 వార్డుల్లో ఆయన జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి కరపత్రాలు అందజేసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కుప్పం నియోజకవర్గ ప్రజలు పొందిన లబ్ధి గురించి వారికి వివరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, ప్రజల ఆకాంక్షలకు మించి జగనన్న సుపరిపాలన అందించారని పలు రాష్ట్రాలు కూడా మన ప్రభుత్వ పథకాలపై ఆసక్తి చూపాయని గుర్తు చేశారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబమూ లబ్ధి పొందింది జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకుని సంతోషంగా ఉంటున్నాయన్నారు. చిత్తూరు ఎంపీగా రెడ్డెప్పను, ఎమ్మెల్యేగా తన భర్తకు ఒక అవకాశం ఇచ్చి గెలిపిస్తే కుప్పం అభివృద్ధి కట్టుబడి, మరెంతో చేస్తారని దుర్గ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్,స్థానిక కౌన్సిలర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు మేలుకోరేవారే కావాలి

రైతాంగానికి మేలు చేసే వారికే ఎన్నికల్లో తాము మద్దతునిస్తామని రైతన్నలు ముక్తకంఠంతో చెప్పారు. తాము ఎన్నో ప్రభుత్వాల పాలన చూశామని, ఆయా ప్రభుత్వాలు ఎవరికెంత మేలు చేశాయో..నష్టం కలిగించాయో తమకు స్పష్టంగా అవగాహన ఉందంటున్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓట్లు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే...

– (సాక్షి నెట్‌వర్క్)

ఊర్ల ముంగిటకే సేవలు



ఇంతకు ముందు మేం సాగు చేసిన పంటలకు ఏదైనా రోగ మొస్తే ఆ మొక్కను తీసుకెళ్లి, టౌన్‌లోని పురుగుల మందు అంగడిలో చూపిస్తే వాళ్లిచ్చే మందు వాడేవాళ్లం. పంట దెబ్బతింటే ఇక అంతే కత. కానీ ఇప్పుడలాకాదు ఊర్లలో ఉన్న సిబ్బంది మా పొలాలకాడికే వచ్చి చూస్తాండారు. ఏమైనా తెగుళ్ల ఉంటే ఏయే మందులు వేయాలో చెబుతున్నారు.

– గోవిందురెడ్డి, రైతు, బేరుపల్లె, పలమనేరు

మేలు చేసిందెవరో బాగా తెలుసు



నేను 40 ఏళ్లుగా సేద్యం చేస్తున్నా. ఎన్నో ప్రభుత్వాలను చూశా. రైతులకు మేలు చేసిందెవరో మాకు తెలీదా!? గతంలో వానలు లేక, ఎండిన చెరువులను చూశాం, ఇప్పుడు పచ్చటి పొలాలు, రైతులకు అవసరమైన సేవలు, వానదేవుడి కరుణ చూశాం. ఏ ప్రభుత్వంలో నాలాంటి రైతులకు మేలు కలిగిందో..ఎన్నికల్లో ఎవరికి ఓట్లేస్తే మా బతుకులు బాగుంటాయో మాకు తెలుసులేవయ్యా.

– రత్నక్క, ఆదర్శరైతు, కొలమాసనపల్లె, పలమనేరు

రైతుల బాగు కోరే వారికే మా ఓటు



వ్యవసాయ సీజన్ ప్రారంభం నాటికి పెట్టుబడి సాయం ఎవరు ఇస్తారో..పంట నష్టపోతే సరైన పరిహారం సకాలంలో ఎవరు ఇస్తారో...అలాంటి నాయకుడికే మా రైతులు ఓటు వేస్తాం. ఎన్నికలప్పుడు వచ్చి ఉత్తుత్తి హామీలు ఇచ్చే నాయకులను ఎప్పటికీ నమ్మం.

– కదిరివేలు, ఊరునాయునిపల్లె, కుప్పం రూరల్

పంటలు బాగా పండాయి...



ఈ ఐదేళ్లలో ఎప్పుడూ కరవనంతగా వర్షాలు బాగా కురిసాయి. మా పొలాల్లో పంటలు బాగా పండాయి. డీకేటీ భూముల్ని వ్యవసాయ భూములుగా మార్చడానికి దరఖాస్తులు తీసుకున్నారు. మెట్ట భూములున్న రైతుల ఆనందం ఇంతా అంతా కాదు. ఇప్పటి వరకూ ఇలాంటి సాహసం ఎవరూ చేయలేదు.

– మునిరత్నంరెడ్డి, కలగటూరు, గంగవరం

సాయం చేసిన ప్రభుత్వాన్నే ఆదరిస్తాం



కష్టకాలంలో మాకు పంటల సాగుకోసం పెట్టుబడి సాయం చేసిన ప్రభుత్వాన్నే ఆదరిస్తాం. పంటల సాగుకోసం రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచే ప్రభుత్వమే రావాలి. అలాంటి ప్రభుత్వానికి మా రైతుల మద్దతు ఉంటుంది.

– పురుషోత్తం రెడ్డి, యనమచామనపల్లె, చౌడేపల్లె

వ్యవసాయం పండగే..



రైతుల కష్టాలను తెలుసుకుని అప్పట్లో ఉచిత కరెంటు ఇచ్చారు. రుణమాఫీ, కరెంటు బిల్లులను మాఫీ చేశారు. ఆ విధంగా రైతులకు ఎంతో చేశారు; చేస్తున్నారు. అప్పట్లో వ్యవసాయాన్ని పండగ చేశారు. అలాంటి వారికే మా మద్దతు.

– లక్ష్మయ్య, గుట్టకిందపల్లె, చౌడేపల్లె

మేలు చేసినవారికే మద్దతు



మాకు మేలు చేసిన వారికే ఎన్నిక ల్లో మద్దత్తు ఇస్తాం. పంటలకు గి ట్టుబాటు ధర ఇచ్చినారు. రైతుబాగుంటేనే కదా అందరూ బా గుండేది.. తప్పుడు హామీలు ఇచ్చే వాళ్లు కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేసిన వారిని గెలిపిస్తే మంచిది.

– హరికృష్ణారెడ్డి, మట్లోళ్లపల్లె, రొంపిచెర్ల

రైతులకు ప్రాధాన్యత ఇస్తేనే భవిష్యత్తు



రైతులను గుర్తించిన ప్రభుత్వాలకే భవిష్యత్తు ఉంటుంది. రైతుల కడుపు కొడితే పుట్టగతులు ఉండవు. ఇది ఇంతకు ముందు రుజువైంది. వ్యవసాయరంగాన్ని బాగా ప్రోత్సహించాలి. అలాంటి వారికే ఓటు వేస్తాం.

– యల్లారెడ్డి, కంభంవారిపల్లె, సదుం

రైతుల అభ్యున్నతికి పథకాలు



వ్యవసాయంతో రైతులు అభివృద్ధి చెందేలా పథకాలు రూపొందించాలి. అటువంటి నాయకునికి ఓటు వేస్తాం. కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేసి వ్యవసాయాన్ని పూర్తిగా గాలికి వదిలివేసిన పార్టీలకు ఓటు వేయాల్సిన అవసరం లేదు.

– శంకర్, బల్ల

మేలు చేసిన ప్రభుత్వానికే ఆదరణ



రైతులు మేలు చేసిన ప్రభుత్వాన్నే ఎప్పటికీ ఆదరిస్తారు. అంతేగానీ తూతూ మంత్రంగా ఉత్తుత్తి హామీలిచ్చి రైతులను మోసగించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవు. ఈ ప్రభుత్వంలో మాకు మేలే జరిగింది. చెప్పిన సమయానికే రైతు భరోసా వేశారు.

– చలపతిరెడ్డి, కొత్తపల్లె, గంగవరం

'కౌలు' బతుకుల్లో పచ్చదనం



రెండెకరాల భూమిలో మామిడి చెట్లు పెట్టుకున్నా. మామిడి ఫలసాయం, కౌలు వ్యవసాయంతో కుటుంబం గడచిపోతాంది. ఎన్నో ప్రభుత్వాలను చూశా. అయితే కష్టానికి తగ్గ ప్రతిఫలం ఎప్పుడూ అందలా. ఇప్పటి ప్రభుత్వంలో ఎంతో మేలు పొందాం. రైతుల ఆదుకున్న ప్రభుత్వాన్నే మళ్లీ ఆదరిస్తారు.

– శ్రీరాములు, కల్లుపల్లె, గంగవరం

రాజు బాగుంటేనే రాజ్యం



రాజు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది. రాజు చక్కగా పరిపాలిస్తే ఆ రాజ్యంలో వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు బాగా పండుతాయి. రైతులు ఆనందంగా ఉంటారు. రాజు సక్రమంగా లేకపోతే ఆ రాజ్యంలో వర్షాలు లేక, పంటలు పండక, రైతులు ఇబ్బందులు పడతారు. ఎవరి పాలనలో కరువు కాటకాలతో అగచాట్లు పడ్డామో అందరికీ తెలుసు.

– శీనప్ప, చిన్నశెట్టిపల్లె, గుడుపల్లె

అన్నదాతల సంక్షేమమే ..



అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే వారికే మద్దతు ఇస్తాం. చెప్పేదొకటి.. చేసేదొకటి వారికి మద్దతు ఇవ్వం. చెప్పింది చెప్పినట్లు చేసేవారికే మా మద్దతు ఉంటుంది. అలాంటి వారితో ప్రజలకు న్యాయం కలుగుతుంది.

– మునివెంకటప్ప, శాంతినగరం, పెద్దపంజాణి

రైతు బాంధవునికే మద్దతు



రైతుల కష్టసుఖాలు తెలిసిన రైతు బాంధవునికి ఈ ఎన్నికల్లో నా మద్దతు ఉంటుంది. అంతేగాని విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలని రైతుల గురించి అవహేళనగా మాట్లాడిన వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వం.

– సుబ్రమణ్యం, బగళనత్తం

రైతులకు అండగా ఉంటేనే..

రైతులకు సాయం చేసిన ప్రభుత్వాలకు అండగా నిలుస్తాం. ఆపద సమయంలో అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ ఆదుకునే ప్రభుత్వాలు ఉండాలి. అలా ఎవరు న్యాయం చేస్తారో వారినే కోరుకుంటాం.

– హరినాథరెడ్డి, ముతుకువారిపల్లె, పులిచెర్ల

కందగండ్లు తీర్చే వారికే ఓటు



కుప్పం మొదటి నుంచీ కరువు ప్రాంతం. ఇలాంటి ప్రాంతానికి శాశ్వత సాగు, తాగునీరు ఇచ్చేందుకు ఎవరూ ఆలోచన చేయలేదు. కుప్పం రైతుల కష్టాలు తీర్చలేదు. ఎవరు కుప్పానికి కృష్ణమ్మ నీళ్లు తీసుకువచ్చి, రైతుల కండగండ్లు తీరుస్తారో వారికే ఓటు వేస్తాం.

– చిన్నప్ప, ఊరునాయునిపల్లె, కుప్పం

వైభవంగా సీతారాముల కళ్యాణం


ఉత్సవమూర్తులకు నిర్వహిస్తున్న కళ్యాణోత్సవం

పలమనేరు: స్థానిక పాతపేట వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల హోరు, భక్తజన సందడి నడుమ ఈ కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అంక్షింతలను భక్తులకు నిర్వాహకులు పంపిణీ చేశారు.


కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణం..కమనీయం

పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరులో గురువారం రాత్రి గ్రామస్తులు సీతారాముల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. చౌడేపల్లె మండలం అగ్రహారానికి చెందిన ఆనందచార్యులు, అనురాధ దంపతులు కళ్యాణోత్సవానికి తాలిబొట్టును విరాళంగా సమర్పించారు. కార్యమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆశీర్వాద్ దే అల్లాహ్..!


వర్షం కోసం ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రామకుప్పం: 'అల్లాహ్ కీ బారిష్ బర్‌పూర్ హో..ఫసలే అచ్చీ హో..సభీ లోగోంగో మానసిక్ శాంతి మిలే..ఇస్‌కే లియే ఆశీర్వాద్ దే..'(అల్లాహ్..వర్షాలు బాగా కురిపించు..పంటలు సమృద్ధిగా పండేలా కరుణించు..ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా దీవించు..) అని ముస్లింలు వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొంతకాలంగా రామకుప్పం మండలంలో వర్షాలు లేక రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక జామియా, మదీనా, మక్కా మసీదులకు చెందిన ముస్లింలు ప్రార్థనలు చేశారు.